# కలం స్నేహం



రావి కొండలరావు

నీట్లో మునిగిపోతున్నవాడు కట్టెపుల్ల కనిపిస్తే బ్రతుకుమీద ఎంత ఆశపడతాడో-పదిరోజులుగా తిండిలేక మాడిపోతున్న వాడికి అంతదూరంలో అణాకాసు కనిపిస్తే ఎంత ఆనందం పొందుతాడో—ఉద్యోగం కోసం, సంవత్సరాలతరబడి దరఖాసులు పంపుకుంటూ ఏదీ రాకపోగా నిరుత్సాహపడేవాడికి, చిన్ననౌఖరీ చూపిస్తే ఎంత సంబరపడతాడో—ఈ పుస్తకంలో 'అది' కనిపించగానే అంత ఆశా ఆనందమూ సంబరమూ పడి, సంతోషంలో ఒళ్లుమరిచి కెవ్వున కేక వేసి, అమాంతం కుర్చీలోంచి అడుగుదూరం పైకెగసి, మళ్లీ కూలబడి తెలివి తెచ్చుకుని, గుండెమీద చెయ్యి వేసుకుని "అమ్మయ్య" అని ఉల్లాసంగా నిట్టూర్చాడు సుబ్బారావు! 'అదే'మిటంటే చాలా రోజులుగా సుబ్బారావు ఎదురు చూస్తున్న 'కలంస్నేహం' ఇవాళ ఈ పుస్తకంలో కనిపించింది. "కుమారి టి. ఇందిరాదేవి, 19 సంవత్సరాల వయస్సు, అభిరుచులు: సాహిత్యపఠనం, రచన, తేలిక సంగీతం, సినిమాలపై విమర్శ—" ఆమె చిరునామా క్రిందవున్నది. తన అభిరుచులు గల వ్యక్తితో స్నేహం చెయ్యటానికి ఇందిరాదేవి గాఢంగా కాంక్షిస్తున్నది! ఆ అభిరుచులన్నీ చదివి—"ఇవన్నీ నావే, నావే" అనుకున్నాడు సుబ్బారావు తన్మయుడై. ఈ అభిరుచులు కలిసి—తనకంటె వయస్సులో మూడు, నాలుగు సంవత్సరాలు తక్కువై వుండే అమ్మాయికోసం సుబ్బారావు తపస్సుచేశాడు—ఇవాళ దాదాపు ప్రత్యక్షమైనట్టే! సుబ్బారావు ఆదర్శం ఏమిటంటే తన అభిరుచులు కలిగే అమ్మాయితో 'కలంస్నేహం' చేసి, ఆమెను ప్రేమించి పెళ్లిచేసుకోటం!

ఐతే ఈ ఇందిరాదేవి తనను ప్రేమించవద్దూ? ఆమెకు అటువంటి అభిప్రాయం వున్నదో లేదో—లేక ఇంకెవడన్నా ప్రియుడున్నాడేమో! ఏమయినాసరే, ఆ అమ్మాయికూడా తనను ప్రేమించేటటు చేసుకోవటం తన విధి! చేసుకోలేకపోతే తన తెలివంతా నిష్ప్రయోజనం! సుబ్బారావు నూటా ఒక్కసారి ఆమె పేరునూ, అభిరుచులనూ, చిరునామానూ, క్షుణ్ణంగా చదివి, కంఠతా పెట్టేశాడు! 'ఇందిరాదేవి' ఆహా! పేరుకూడా అందంగా తను కోరుకున్నపేరులాగే వుంది. సుబ్బారావు తనజీవితం ఇప్పటికి కదా సఫలము కాబోతున్నదని హాయిగా పాడుకుంటూ, పుస్తకాన్ని తీసుకొని వాయువేగ మనోవేగాలతో రామ్మూర్తి రూముచేరాడు. (రామ్మూర్తి గది 'లోకల్ రోమియోస్ అసోసియేషన్' కార్యాలయం వంటిది. రామ్మూర్తే దానికి ప్రెసిడెంటు. సభ్యులంతా సెలవురోజులలో సమావేశమవుతూ చర్చలూ, తీర్మానాలూ జరుపుతూ వుంటారు.)

"దొరికిందిరోయ్ దొరికింది" అన్నాడు అరున్నరశృతిలో సుబ్బారావు గదిలో అడుగుపెడుతూ.

"ఇక్కా! ఏమిటా దొరకటం?" అన్నాడు రామ్మూర్తి పత్రికలో 'భగ్నప్రేమ' చదువుకుంటున్నవాడల్లా చిరాగ్గా కదిలి.

"పెన్నిధిరా నాయనా! దా—చూడు - నీకళ్లతోనే చూడు. నేను చెబితే నమ్మవు. ఇన్నాళ్లకు నా సమస్య తీరింది. ఈ రోజు నుంచి సుబ్బారావులో శూన్యత నువుగానవు. వాడి ప్రేమోడైన, వాడి జీవితం చిగిరించబోతున్నది. ఇహ వాడు..."

"అబ్బబ్బబ్బ బ్బ...ఏమిటా జరిగింది?"

"నేను చెప్పను. నువ్వే చూసుకో" అని చూపించాడు సుబ్బారావు.

అంతా చదివి, రామ్మూర్తి "ఐతే?" అన్నాడు కనుబొమలు చిట్లించి.

"నాజమ్మ. 'ఐతేట ఐతే'—ఇదా నీ తెలివి? నీతో ఏమని చెబుతూ వచ్చాను? నా అభిరుచులుగల పిల్లకోసం చస్తున్నానురా అని చెప్పలేదూ? అదే—ఆ పిల్లే ఇవాళ చేతిలో కొచ్చింది!"

"ఇహ నువు ఉత్తరాలు రాసి ఆమెను వశం చేసుకుంటావన్నమాట!"

"కరక్టు. వశం చేసుకోవటం ఏమిటోయ్-నన్ను తప్ప ఇంకొకడిని పెళ్ళి చేసుకోనని ఆమెచాతే అనిపిస్తాను."

"కొంపమునిగిపోయిందిరా సుబ్బారావ్!" అన్నాడు కసీమని రామ్మూర్తి తలపట్టుకుని.

"ఎవరిదిరా బాబూ ఎవరిది? నీదా-నీదా?" అన్నాడు సుబ్బారావు ఆత్రుతగా.

"నీదే—ఏం లేదు—ఈ ఇందిరాదేవి కొంపదీసి అనాకారి ఐతేనో?" అన్నాడు రామ్మూర్తి.

సుబ్బారావు ఐదు నిమిషాలపాటు భళ్ళు భళ్ళుమని నవ్వి—

"వెధవ సంస్కారం అక్కడే దెబ్బతిన్నది. అనాకారి ఐనా సరే—చేసుకోక తప్పదు. ఇక్కడ ఆకారం ప్రసక్తి లేదు-అభిరుచుల ప్రసక్తేగాని!" అన్నాడు చెయ్యి తిప్పుతూ.

"ఐతే సరే" అన్నాడు రామ్మూర్తి.

* * *

"రామ్మూర్తి రూమ్‌లో కూచునే సుబ్బారావు ఇందిరాదేవికి ఒకఉత్తరాన్ని తయారు చేశాడు—కొంత కాఫీ త్రాగి, కొన్ని సిగరెట్లు కాల్చి.

"ఇందిరా రామ్మూర్తీ ఇంది. ఇహ విను!"

అన్నాడు సుబ్బారావు. రామ్మూర్తి వింటున్నాడో లేదో కూడా గమనించకుండా ఉత్తరాన్ని చదవసాగాడు:

"కుమారి ఇందిరాదేవి గారికి—

కేవలం భగవంతుడు పంపినట్టు–మీ చిరునామా గల పత్రిక చూసి, ఆనందపరవశుడనయినాను. మీ హాబీలే నా హాబీలు...నా హాబీలే మీ హాబీలు! ఎంతకాలంనుంచో ఇటువంటి స్నేహంకోసం ఎదురుతెన్నులు చూస్తేగా మీరు కనిపించటం నా అదృష్టం. నేను ఈ వూళ్ళో కాలేజీలో చదివి, బి. ఏ. లో ఒకభాగం విజయం పొంది, మిగిలిన భాగాలలో కూడా పొందటానికి కృషి చేస్తున్న ఇరవై మూడు సంవత్సరాల విద్యార్థిని. పాటలు, గేయాలు, కథలూ రాశాను. పాడగలను. హార్మనీ వాయించటం కొద్దిగా తెలుసును. ఇరవై నాలుగు గంటలలోనూ ఎక్కువ కాలం సాహిత్య పఠనం చేస్తాను. వచ్చే ప్రతీ సినిమా చూసి, స్నేహితులదగ్గర చర్చిస్తూవుంటాను. మీ స్నేహాన్ని కాంక్షించటమే నా జీవిత పరమావధి. ఇకమీదట నిరాటంకంగా సాగరంలో కెరటాలు పుట్టినట్టు అదేపనిగా మనం ఉత్తరాలు రాసుకోవాలని నా కోరిక. అన్ని విషయాలతోనూ వెంటనే పై చిరునామాకు జవాబు రాస్తారని ఎదురుచూస్తున్నాను.

భవదీయుడు,
వి. సుబ్బారావు.
కలం పేరు: ("సుబ్బశ్రీ")

"కాస్త చిన్నదయిందంటావా?" అన్నాడు సుబ్బారావు ఉత్తరం చదివి.

"పెద్దదే వుందేమో! ఫరవాలేదులే. పోస్టు చెయ్యి" అన్నాడు రామ్మూర్తి. సుబ్బారావు చిరునామా కేరాఫ్ రామ్మూర్తిగా ఇచ్చాడు.

ఇందిరాదేవికి ఉత్తరం పోస్టయిన మరుక్షణంనుంచీ సుబ్బారావుకు ఏదో దిగులూ, అంతలోనే ఆనందమూ మధుర భావాలూ అన్నీ కలగసాగినై. ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. ఇందిరాదేవి రూపాన్ని వూహించసాగాడు—ఆమె నవ్వితే పలువరస ఎటా మెరుస్తుందో–ఆ పొడవైన నల్లని జడ త్రాచల్లే ఎట్లా వ్రేలాడుతున్నదో– ఆ నల్లని కాటుక కళ్ళల్లోని నీలినీడల్లో తనెట్లా కరిగిపోవాలో –ఇవన్నీ ఆమెను చూసినట్టే రూపకల్పన చేసుకుని, భావించుకున్నాడు. తన ఉత్తరంలోని భావాలకు ఆమె ముగ్ధురాలవుతుంది – తన చేతివ్రాతకు ఆమె మురిసిపోతుంది – తన వంటి స్నేహితుడిని పొందినందుకు ఇందిరా

(60-వ పేజీ చూడండి)

## ★ జీవనలీల ★

"ఒంట్లో బాగా లేదామతీ? అందుకనా అలా మాట్లాడకుండా కూర్చున్నావ్? అయ్యో పోనీలే, చినబాబుకి కబురంపనా? పరీక్షచేసి మందిస్తాడు..." అన్నది.

"ఎందుకిలా వేధిస్తావ్ వదినా? నీకు నేనే అపకారం చేశానని?"

"కళ్లు జలజలలాడుతున్నాయి–అదిగో: చూశాడంటే చినబాబుకి గుండె బ్రద్దలైపోతుంది".

"ఏ-ఫో-చాలై నారాజేం నీకు!"

"నీకు తెలుసో తెలియదో మతీ? రాత్రంతా నువ్వే తలపుకు రావటంతో చినబాబుకి అసలు నిద్రేపట్టలా. మతీ, మతీ, మతీ! అంటూ అలాగే స్మరణచేస్తూ కూర్చున్నాడు. నువ్వేక్కి కనుక నిన్నిచ్చి చేస్తే చినబాబు తాళ్లచెరువులో దుమికి ఆత్మహత్య చేసుకుంటాడు".

"నువ్వే తాళ్లచెరువులో మునిగిచావు. చచ్చి దయ్యమవు"

మతి ఇహ అక్కడినుంచి వెళ్లిపోబోయింది. కుసుమతో మాటాడి నెగ్గగలదా ఆమె. కాని కుసుమమాత్రం మతిని విడిచిపెట్ట లేదు. చటుక్కున మతిని చెయ్యిపట్టుకుని ఆపింది. తన ముఖాన్ని ఆమె ముఖం దగిరగాపెట్టి, కన్నార్పకుండా చూస్తూ, పళ్లు బిగబట్టి, "సిగ్గులేదూ నీకు? ఇన్నేళ్ళు వచ్చాయి-ఇంత పెద్దదానివయావ్. సిగ్గులేదూ నీకు? పూటకి టికాణాలేని గొల్లయింటిపడుచువి చినబాబుతో పోల్చిచూస్తే నువ్వు తక్కువదానివి కాక ఏమిటి? ఎందుకు నీకింత మిడిపేరక్క గుణాలు! నువ్విలా చేస్తావ్ కనుకనే చిరాకుపుట్టి చినబాబు రావటం మానేశాడు" అంది.

అలా అనగానే మతి కుసుము చెయ్యి కొరికింది. ఆమెని వదిలించుకుని, తన కొరికిన చేతిని అటూ యిటూ త్రిప్పి మతి పంటి గుర్తులు చూసుకుంది కుసుమ.

"కొరికావు! నువ్వు నన్ను కొరికావుకదూ! ఉండు, నిన్ను ఏంచేసానో చూడు"

ఏంచేస్తుంది కుసుమ మతిని ఏంచేస్తుంది? మతి గుండె దడదడలాడిపోయింది. ఓవేళ చినబాబుతో చెపుతుందా యేంకొంపతీసి తాను కుసుమ చెయ్యి కొరికానన్న సంగతి వింటే చినబాబుకి పెద్ద కోపం వచ్చేస్తుంది అని మతి అనుకుంది.

కాసేపయేసరికి మళ్లీ మతి కుసుముచుట్టూ తిరగటం మొదలెటింది. మధ్యలో ఓసారి ధైర్యంచేసి "ఏదీ? బాగా నొప్పి ఎక్కిందా? చూడనియ్" అని అడిగింది.

కుసుమ నిఘంటువులో 'క్షమ' అనేమాటలేదు. ఆమె మతిని అనుకరిస్తూ "నొప్పిఎక్కిందావదినా అంటున్నావా? కొరికి పైగా ఏమీ ఎరగనిదానిలా వస్తావేం?" అన్నది.

మతి బయటికివచ్చి స్తంభానికి చేరగిలపడి నుంచుని, 'వదిన ఎంత భయంకరమైనవ్యక్తి! తిన్నగా వెళ్లి చెప్పేస్తుందేమో' అనుకుంది. తెరచి ఉన్న గుమ్మంలోంచి పినతల్లి కన్పిసూ ఉంటుంది. ఆమెకి ఇటీవల మాట పూర్తిగా పోయింది. మాటాడకపోతే గొంతులోంచి 'ఉస్, ఉస్' అని ధ్వనులు వస్తూంటాయి — అంతే ఏంమాట్లాడలేదు. మతినిచూసి, ఆమెని దగిర రమ్మని చెయిఊపి సైగచేసింది. తలయెత్తి చెయ్యి నోటిదగిర పెట్టుకుని, 'దాహం' అన్న అర్థాన్ని వ్యక్తంచేసింది. మతి ఆమెనిచూసినా, చాలా సేపటిదాకా అక్కడినుంచి కదల్లేదు.

"వసున్నా – వస్తున్నా. ఎందుకంత తొందర?

"ఎవరే పిలుస్తున్నది మతీ?" అని అడిగింది మోక్షదా.

"పిన్ని – పిన్ని. ఆవిడకి మంచినీళ్లు కావాలిట!" అన్నది మతి.

(ఇంకా వుంది)

---

## ★ కలం స్నేహం ★

(9-వ పేజీ తరువాయి)

దేవి మైమరచి, స్వర్గంలో విహరిస్తుంది!

సుబ్బారావుకు కునుకు పట్టబోయే సమయానికి, వీధిగుమ్మంలో పాలవాడి కేక వినిపించింది!

* * *

ఇందిరాదేవికి ఉత్తరంరాసి వారం రోజులైంది. ఇంకా ఆమె దగ్గర్నుంచీ ఏ జవాబూ రాలేదు. ఈ వారం రోజులుగా సుబ్బారావూ తన మనసూ ఒకచోటలేదు–అతనిలోంచి ఆ మనసు ఎగిరిపోయి, ఎక్కడెక్కడో విహరించసాగింది! రోజూ రామ్మూర్తి రూమ్‌లో కూచోటం—వచ్చేపోయే పోస్టుమాన్‌ను పలకరించటం — ఇది అతని కార్యక్రమం!

సుబ్బారావు ఉదయాన్నే ఎనిమిది గంటలకు 'ఇందిరాదేవి'ని తల్చుకుంటూ లేచాడు. స్నానంచేసి బట్టలు వేసుకుని రామ్మూర్తి గదికి శరీరాన్ని లాక్కుపోతూ దారంతా ఆలోచించసాగాడు. ఇందిరాదేవికి తన ఉత్తరం అందిందా లేదా? అది కొంపదీసి ఇంకెవరన్నా చదివారా? ఆమెను తను నచ్చలేదా? తన ఉత్తరానికి ఆమె నవ్వుకున్నదా? లేకపోతే ఈ ఇందిరాదేవి ఇదంతా వఠికల్పనా? — ఈ ఆఖరి ప్రశ్న కలగగానే సుబ్బారావుకు భూమికింద ఏదో పగిలినట్టూ తను ఆ అగాధంలో కూలిపోతున్నట్టూ భ్రమ కలిగింది. అంతలోనే కాళ్లు నిలదొక్కుకుని "ఆఁ! ఇదంతా నా ఆలోచనే గాని—కల్పన ఎందుకవుతుందీ!" అనుకుంటూ రామ్మూర్తి గది చేరుకున్నాడు.

"వచ్చిందిరా ఉత్తరం వచ్చింది" అన్నాడు బ్రహ్మాండంగా రామ్మూర్తి ఎనిమిదిన్నర శృతిలో, సుబ్బారావుకు ముచ్చెమటలూ పోసినై. రామ్మూర్తి వాడి గది అంతా పచ్చగా కనిపించింది కాళ్ళూ చేతులూ వణకసాగినై. ఆత్రుతగా తీసుకుని, చించి చదవసాగాడు. చదువుతున్నంతసేపూ అతని గొంతును ఎవరో అటూ ఇటూ వూపుతున్నట్టుంది! శ్రీ సుబ్బారావుగారికి—

మీ లేఖ చేరింది. నాకు మహదానందమయింది. మీ వంటి స్నేహితుల కోసమే నేను ఎదురుచూస్తున్నాను. నేను ఈ వూరి కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్నాను. నాకు పుస్తకాలు చదవటమంటే మరీం అక్కర్లేదు. సినిమాపాటలు పాడతాను. అప్పుడప్పుడూ పత్రికల్లో స్త్రీల పేజీల్లో చిన్న చిన్న వ్యాసాలూ లేఖలూ రాస్తూ వుంటాను. కథలుకూడా కొన్ని రాశానుగాని — పత్రికలకు పంపలేదు. మీ ఉత్తరంలో మీ భావాలు నాకు నచ్చినై. అంతంత భావాలతో ఉత్తరాలు రాద్దామనుకుంటూనుగాని — భయం! 'సుబ్బశ్రీ' అనే పేరుతో రెండు మూడు గేయాలు చదివినటు జ్ఞాపకం. ఇంగ్లీషు సినిమాలు మా వూళ్ళో వారానికోసారి వేస్తారు. ప్రతీ సినిమాకూ పోతాను. ఈ మధ్య నిూ కేమయినా ఈ మధ్య కొత్తచిత్రాలుచూస్తే విమర్శించండి. తెలుగు రచయితలలో మీ అభిమాన రచయిత లెవరు? వెంటనే జవాబు రాస్తారని భావిస్తున్నాను.

ఇట్లు,
ఇందిర

"శాభాష్" అన్నాడు రామ్మూర్తి కవ్వింపు.

"ఇందిరా" అని సుబ్బారావు ఆ వుత్తరాన్ని గుండెకు హత్తుకుని "దేవతలారా—నాపై పుష్పవృష్టి కురిపించండి. కోకిలా—నీలోవున్న సంగీతం అంతా పాడు. పూర్ణచంద్రమా—పూర్తిగా వికసించి నీ చల్లని వెన్నెల్లో నన్ను స్నానమాడించు! మధుర మారుతమా! కమ్మగా వీచి వరవశుణ్ని

"చెయ్యి!" అన్నాడు అటూ ఇటూ చూసి అరుస్తూ.

"ఏ నాటకంలో సంభాషణలురా ఇవి?" అన్నాడు రామ్మూర్తి 'కూల్'గా.

"నా పరువు పోగొట్టావురా దుర్మార్గుడా! ఒకడి నాటకంలో సంభాషణలు చెప్పే ఖర్మం నాకేంరా? స్వంతం—కేవలం స్వహస్తంతో లిఖించుకున్నది!"

"లిఖించుకున్నదా—సరే, ఇప్పటికిప్పుడు ఆశువుగా చెప్పింది కాదన్నమాట, రక్షించావు! జవాబు రాయి మరి—" అన్నాడు రామ్మూర్తి.

"ఈ సారి గుప్పిస్తా" అని వికిలిగా నవ్వి "సుబ్బారావు అంటే వెర్రి వెధవనుకున్నావేమో—హుఁ! అమ్మాయిలను ఆకర్షించే పవర్ ఫుల్ మాగ్నెట్!" అన్నాడు కళ్ళు మరిచిపోయి. ఆ ఉత్తరాన్ని తీసుకుని రామ్మూర్తి మరో రెండుసార్లు చదివాడు. "ఏది నీ చెయ్యి" అని కరస్పర్శ చేసి ఊపుతూ "నీ కోరిక ఫలించాలని కోరుతున్నాను" అన్నాడు సీరియస్‌గా. సుబ్బారావు వికిలిగా గొప్పగా ఆదోగా, హాయిగా నవ్వాడు!

* * *

ఇందిరాదేవికీ సుబ్బారావుకూ ఉత్తర ప్రత్యుత్తరాలు విరివిగా జరుగుతున్నై. ఉత్తరాలన్నీ రామ్మూర్తి కూడా చూస్తూ తగిన సలహాలిస్తున్నాడు. ఇన్నాళ్ళుగా ఉత్తరాలన్నీ మామూలు ధోరణిలో నడిచినై. రామ్మూర్తన్నట్టు—ఇందిరాదేవితో బాగా పరిచయమైపోయింది—ఇక అసలు విషయంలోకి దిగాలి!

ఏమయితే అవుతుందని, సుబ్బారావు ఇందిరకు మొదటిసారిగా ప్రణయలేఖ తయారుచేశాడు. "ప్రియమయిన ఇందిరాదేవికి—" అని ప్రారంభించి ఆమె తనకు ఎట్లా నచ్చిందో, తనకూ ఆమెకూ ఎట్లా మనసులు కలుస్తాయో, ఆమె ఉత్తరం రావటం అరగంట ఆలస్యమైతే తనెంత మథనపడతాడో, రోజూ రాత్రులు నిద్రపోకుండా ఆమెను ఊహించుకుంటూ ఎట్లా కలలుగంటున్నాడో—ఆమె లేకుండా తన జీవితం ఎట్లా వ్యర్థమో, మొదలయిన విషయాలన్నీ రాస్తూ—ఈ ప్రేమను తృణీకరించవద్దనీ, ఇది నిర్మలప్రేమనీ, శాశ్వతంగా నిల్చేది అదొక్కటేగాని ఉత్తరాలు కావనీ, తనను పూర్తిగా నమ్మమనీ, తన సర్వస్వమూ ఆమె కేననీ, మనసులు కలిసిన తమవంటివాళ్ళు పెళ్ళి చేసుకోవటం అవశ్యకమనీ—రాశాడు. ఈ ఉత్తరం నిండా కావలసినంత కవిత్వమూ, భావాలు, వర్ణనలూ ఉద్రేకమూ, విషాదమూ మొదలయిన అన్ని రసాలు కనిపిస్తున్నై.

ఈ ఉత్తరాన్ని ఒకటికి రెండుసార్లు చదివి, రామ్మూర్తి తప్పులేదన్నారు. అవశ్యం పోస్టు చెయ్యమని, సుబ్బారావుకు ధైర్యం చాలకపోగా తనే పోస్టులో వేశాడు. ఆక్షణం నుంచీ సుబ్బారావు వొంటిమీద తేళ్ళూ జెఱ్ఱులూ పాములూ ప్రాకటం మొదలెట్టినై. ఈ ఉత్తరానికి ఎటువంటి జవాబు వస్తుందో సుబ్బారావు ఊహించలేకపోతున్నాడు! తిడుతుందా? అసలే రాయదా? లేక 'నాకీ ప్రేమాగీమా అసహ్యం' అంటుందా? ఏం జరగబోతోందో ఎవరు చెప్పగలరు? సుబ్బారావు రకరకాలుగా కించపడసాగాడు.

"ఎంతయినా సుబ్బారావు అదృష్టవంతుడు" అన్నాడు రామ్మూర్తి. వారం రోజులు తిరక్కముందే ఇందిరాదేవి అతని ప్రేమను స్వీకరిస్తూ తన ప్రేమను వెళ్ళబోస్తూ ఎనిమిది పేజీలవుత్తరం రాసింది! ఆక్షణంనుంచీ సుబ్బారావును ఎవడూ పట్టలేకపోయాడు. ఆ ఉత్తరంరాగా అతను ఎనిమిదిసార్లు చదవగా రామ్మూర్తి పదిహేనుసార్లు చదివాడు. తను కూడా సుబ్బారావునే నమ్ముకున్నాననీ, అతని మొదటి లేఖ చదివినప్పుడే తనకు అతనిమీద 'ప్రేమ' ఏర్పడిందనీ, ఆ మాట చెప్పేందుకు ధైర్యం చాలలేదనీ, ఎన్ని ఆటంకాలు వచ్చినా ఈ ప్రేమ నిర్విఘ్నంగా కొనసాగి ఆదర్శ వివాహానికి దారి తియ్యాల్సిందిగా తనపట్టుదలనీ—మొదలయిన విషయాలన్నీ కవిత్వంకట్టి రాసింది.

సుబ్బారావు అఖండ సామ్రాజ్యాలనూ జయించిన మహారాజులా పోజుపెట్టి, ఠీవిగా నడవసాగాడు. అతనిలో సంతోషం కట్టలు దాటి ప్రవహించసాగింది. ఇందిరమీద అతనికి అప్పుడే అధికారం ఏర్పడినట్టూ తన భార్య వినట్టూగానే మాట్లాడసాగాడు రామ్మూర్తితో. రామ్మూర్తికూడా ఒకటి, రెండుసార్లు 'నీ భార్య' అనే అన్నాడు!

ఈ సారి సుబ్బారావు ఇందిరకు ఏకవచనంలోనే స్వేచ్ఛగా విరహాన్ని ప్రకటిస్తూ "పెద్ద" ఉత్తరాన్ని రచించాడు! "మృదుభాషిణీ, ప్రియరమణీ, ఇందిరామణీ" అని సంబోధిస్తూ జాగ్రత్తగా ఆలోచించి మాటలు వేసి పూర్తిచేశాడు. ఈ ఉత్తరంలో, ఆమెను చూసే అదృష్టం ఇంకా కలగలేదు కాబట్టి, కనీసం ఫోటోనయినా వెంటనే పంపాల్సిందిగా అర్థించాడు!.

* * *

పెద్దకళ్ళూ, చక్కని ముక్కూ, నవ్వుతున్న చిన్న పెదవులూ మృదువైన కోలముఖమూ, చూసి సుబ్బారావు ముగ్ధుడయ్యాడు!


IS : 203

ISI

ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూషన్

వారిచే తమకు సర్టిఫికేటు యివ్వబడినదని ఎస్ట్రెలా బ్యాటరీలు సంతోషముతో ప్రకటించుచున్నారు.

ISI చిహ్నం శ్రేష్టతకు గుర్తు. ఇది వున్నచో తయారైన వస్తువులు పరీక్షింపబడినవనియు, అవి ఇండియన్ స్టాండర్డ్సు ఇన్‌స్టిట్యూషన్ పరిమాణముల అందుకొన్నవనియు తెలుపును. క్రొత్తగా వచ్చే ఎస్ట్రెలా బ్యాటరీలన్నింటికి ISI చిహ్నం వుండును.




ఎస్ట్రెలా బ్యాటరీస్ లిమిటెడ్,

బొంబాయి - 1

E-24

# ★ కలం స్నేహం ★

"కేవలం గుణవతేకాదు—రూపవతి కూడాన్రా—నా జన్మతరించిందిరా రామ్మూర్తీ—ఇదంతా పూర్వజన్మ సుకృతం!" అని కేకలుపెట్టి ఇందిర ఫోటోను గంటలతరబడి చూస్తూ వెర్రెత్తిపోయాడు సుబ్బారావు.

"చాలా అందగత్తె" అన్నాడు రామ్మూర్తి. విజయసూచకంగా నవ్వి తల ఆడించాడు సుబ్బారావు ఫోటోను చూస్తూ.

ఆరాత్రి సుబ్బారావు కంటిమీద కునుకు పడితే ఒట్టు! తన తల్లిదండ్రులకు ఈ ఫోటోను చూపించి, ఎట్లాగన్నా వాళ్ళచాత ఒప్పించాలి. ఒప్పుకోకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యం అనాలి. మరి ఇందిరేమవుతుంది? ఆమెకూడా ఏబావినో, రైలునో చూసుకుంటుందా?—ఈ నిర్మల ప్రేమకు అటంకాలేవన్నా కలగబోతే అది తన తల్లిదండ్రుల అభ్యంతరమే తప్ప ఇంకేంకాదు. ఈ ఫోటో చూసి, వాళ్లు తప్పక ఆమోదిస్తారనే ధైర్యం వుండనే వున్నది...కాని—ఏమీ చెప్పలేం! వాళ్లు అడ్డపెట్టినా తెగించి ఈ పెళ్లి జరుపుకోవాలి...లేకపోతే...

నీట్లో మునిగిపోతున్నవాడు కాలూ చెయ్యీ కొట్టుకున్నట్టు అటూ ఇటూ కొట్టుకోసాగాడు ఆమంచంమీద అతనికి లైలామజ్నూ కథా, రోమియో జూలియట్ నాటకమూ, దేవదాసు సినిమా—ఇవన్నీ వొంకర్లుగా తలలో తిరిగినై. అతనికి ఏకోశానా కాలూ చెయ్యీ ఆడలేదు!

అదే రాత్రి రామ్మూర్తికి నిద్ర పట్టలేదు. ఎంత కళ్ళు మూసుకున్నా అతనికి 'ఇందిర బొమ్మే' గుర్తువస్తున్నది. ఆహా! ఏం లావణ్యం! ఏం అందచందాలు! వెధవ—సుబ్బారావుగాడు భలే ఛాన్సు కొట్టాడు. ఏ నాడయినా వాడు ఇటువంటి అవకాశాన్ని పొందగలడని కలగన్నాడా? పైనా ఇదంతా వాడిగొప్పా ఏమిటి? తను తగిన సలహాలివ్వకపోతే, ఈ ఉత్తరాలు రాసేటప్పుడు భావాలూ, మాటలూ సరఫరా చెయ్యకపోతే, వీడిమొహం—వీడినా ఇందిర ప్రేమించేదా? ఇందులో వాడిప్రజ్ఞ ఏం ఏడిసింది గనక?—రామ్మూర్తికి సుబ్బారావుమీద ఎక్కడాలేని 'జెలసీ' ఏర్పడింది. ఈ ఇందిర తను దక్కించుకోటానికి అవకాశాలు ఏమున్నయ్యో వెతకసాగాడు! ఇంతవరకూ సుబ్బారావు రాసిన ఉత్తరాలన్నీ వాడు రాసినవి కావనీ అవన్నీ తను రాసినవనీ ఒక ఉత్తరం ఇందిరకు రాస్తే?...సుబ్బారావు అందవికారమయినవాడనీ, అతనికి ఏఅభిరుచులు లేవనీ, వట్టి మొద్దు అనీ కల్పిస్తే?...ఇవేం లాభం లేదేమో!

సుమారు రెండుగంటలవేళకు రామ్మూర్తికి అపూర్వమైనదీ, ఎవడికీ తట్టనిదీ, బ్రహ్మాండమైనదీ ఒక వూహ కలిగింది. ఈ వూహతో అతను పరమానందభరితుడై సంతోషంగా నిట్టూర్చి ఒళ్ళు మరచి నిద్రపోయినాడు!

* * *

ఇందిరాదేవి నుంచి వుత్తరం వస్తుందని రామ్మూర్తి గదికివచ్చిన సుబ్బారావుకు రామ్మూర్తి పెట్టెలో గుడ్డలుపెడుతూ కనిపించాడు.

"కాంపేమిట్రా?" అన్నాడు సుబ్బారావు.

"అవున్రా. అర్జంటుగా ఇంటికి రమ్మని మానాన్న వైర్ చేశాడు. ఏదో భూములు తగువులే వస్తుంటాయి!"

"మొన్న మొన్న వెళ్ళొచ్చావుగా"

"వీటికి అంతూ పొంతూ ఏమిట్రా? ఈ భూము లున్నవాడికంటే లేనివాడే సహస్రాంతం నయం!... రెండుమూడురోజుల్లో వచ్చేస్తాను. గదితాళం నీదగ్గరేవుంచు!" అని తాళంచెవి సుబ్బారావుచేతిలో పెట్టి తనకు వేళయిందని చరచరా బయలుదేరాడు. కాకీబట్టల మనిషి ఎవడయినా కనిపిస్తున్నాడేమోనని డాబామీదికొచ్చి వీధిలోకి చూడసాగాడు సుబ్బారావు!

* * *

తనవూరికి వెళ్తున్నానని బయలుదేరిన రామ్మూర్తి సరాసరి ఇందిరాదేవి వూరు చేరుకున్నాడు. హోటల్లో స్నానం చేసి, శుభ్రంగా గుడ్డలు వేసుకొని ఇందిరఅడ్రసును బట్టి ఆపేటకు దారితీశాడు. సాయంత్రం నాలుగున్నర కావస్తోంది. ఇందిర కాలేజీనుంచి వచ్చే వేళ. ఇంటిదగ్గరకువెళ్లి పిలిస్తే వాళ్లవాళ్లు 'ఎవరునువ్వు?' అంటే?—అందుకనే ఆలోచించి రామ్మూర్తి సరిగ్గా కాలేజీ వదిలేవేళకు ఆవీధిలో ఆమెకోసం ఎదురు చూడసాగాడు!

ఒకచేతిలో పుస్తకాలు, రెండోచేతిలో ఏదో వస్తువు పట్టుకుని, వయ్యారంగా హంసల్లే నడుస్తూవస్తున్న ఇందిరను రామ్మూర్తి సులభంగా గురుపట్టాడు. అవేకళ్ళు—అదే ముక్కు—అవే పెదవులు...ఆమె బాగాదగ్గరవుతున్నది...రామ్మూర్తికాళ్ళూ చేతులూ గుండె అన్నీ కబ్బంచెయ్యసాగినై. బలవంతాన ఆ వణుకును అరికట్టి, ధైర్యం చిక్కబట్టి, గొంతు సవరించుకుని చెట్టను అనుకుని-ప్రక్కగాపోతున్న ఆమెనుచూసి "మిస్ ఇందిరాదేవి?" అన్నాడు దరాగా. ఆమె ఆగి అతనికేసి అగమ్యంగా చూసింది.

రామ్మూర్తి మెల్లిగానవ్వి—"నేను మీ...సుబ్బారావును!" అన్నాడు!

"ఓ- ఎప్పుడొచ్చారు? రండి మాయింటికి పోదాం" అన్నది ఆత్రుతగా.

"కాదు. కాస్త రహస్యంగా మాట్లాడుకోవాలి. అటు ఎటన్నాపోదాం" అన్నాడు రామ్మూర్తి ధైర్యంగా.

"అభయం ఏమీ లేదు. మాయింట్లో మాట్లాడుకోవచ్చు—రండి!" అన్నది.

రామ్మూర్తి మెల్లిగా ఇందిరను అనుసరించాడు. ఇల్లు చేరగానే ఆమె లోపలకు పోయి పుస్తకాలు పెట్టివచ్చి రామ్మూర్తికేసి దీనంగా చూస్తూ "క్షమించాలి సుబ్బారావు గారూ! స్నేహితులు వచ్చి కూచున్నారు. వాళ్ళుండగా మనం మాట్లాడుకోటం బాగుండదు. రేపు వుంటారుగా - వుదయం తప్పక రండి. మా అన్నయ్యకూడా వుంటాడు - మిమ్మల్ని పరిచయం చేస్తాను!" అన్నది మెల్లిగా. రామ్మూర్తి అమాయకంగా ఆమెకళ్లలోకి చూసి - "సరే, పొద్దున్న ఎనిమిది గంటలకు వస్తాను" అన్నాడు. ఇంతలో లోపల్నుంచీ ఎవరో "అమ్మడూ" అని కేకవేశారు. "వస్తానండీ - సారీ" అని చరచరా వెళ్ళిపోయింది. రామ్మూర్తి నీరసంగా కదిలాడు తన "డ్రెస్" కేసి చూసుకుంటూ!

తనే సుబ్బారావునని చెప్పటానికి రామ్మూర్తి ముందుగా చాలా ఆలోచించాడు. తనుపోయి సుబ్బారావుమీద అసహ్యంగా మాట్లాడితే, ఆమెకు సుబ్బారావుమీద ప్రేమ తగ్గవచ్చునేమోగాని—తనమీద కలిగేందుకు అవకాశంలేదు. "ఈ ఉత్తరాలన్నీ నేనే రాశాను. ఈ ప్రజ్ఞ అంతా నాది. నాపేరు రామ్మూర్తి - నేను సుబ్బారావు స్నేహితుడిని!" అన్నా ఆమె ఒప్పుకోదు. ఇందులో కుట్ర వున్నట్టుగా అనుమానిస్తుంది. అందువల్ల ఆమె ఎట్లాగూ సుబ్బారావును చూడలేదు కాబట్టి - తనే ఆపేరు పెట్టుకుంటే, తను సుబ్బారావుననే భావంతోనే ప్రేమను కురిపిస్తుంది. తర్వాత ఎప్పుడన్నా ఆమె సుబ్బారావును చూసినా నమ్మదు! 'అసలు సుబ్బారావు' అని నమ్మినా మొదటిసారిగా ఆ పేరుతో తనను చూడబట్టి, తనముద్ర ఆమెలో స్థిరపడబట్టి, సుబ్బారావుమీద ప్రేమ తగ్గటానికి అవకాశాలుండవచ్చు. ఒకవేళ తగ్గినా తగ్గకపోయినా, ఈ పేరు చెప్పటంవల్ల కనీసం రెండు రోజులపాటన్నా ఆమెతో హాయిగా వున్నాననే తృప్తివుంటుంది. తర్వాత ఏమయితే మాత్రమేం గనక?—

రామ్మూర్తి హోటల్ రూమ్ చేరుకుని, మర్నాటి ఉదయం ఎనిమిది గంటలకు ఇంకా ఎంత 'టయిము' వుందో గడియారం చూసుకున్నాడు!

* * *

ఆపూట సుబ్బారావుకు ఇందిరనుంచి ఉత్తరం చేరలేదు. అతనికి ఏదో చెప్పరాని

ఆ వేదన కలగసాగింది. ఇందిర రూపమే తప్ప అతనికి ఇంకోక వస్తువు కనిపించటం లేదు. గదిలో అటూ ఇటూ తారట్లాడ సాగాడు. రామ్మూర్తికూడా లేదేమో, అతనికి అసలు తోచటం లేదు.

సుబ్బారావుకు తపీమని ఒక ఆలోచన తోచింది. ఇందిరను చూడాలనీ, ఆమెతో మాట్లాడాలని తను ఎట్లాగూ తహతహలాడుతున్నాడు - ఇవాళే బయల్దేరివెళ్లి కలుసుకుంటేః—గదికి తాళం వేసి గాలిలో ఎగురుతూ ఇల్లు చేరుకుని స్నేహితుడి పెళ్ళికి అర్జంటుగా వెళ్ళాల్సి వచ్చిందని ఇంట్లో బొంకి, కొంత డబ్బు ఎక్కడో అప్పుచేసి, ఆ సాయంత్రం బండికే ఇందిర వూరుకు బయలుదేరాడు!

*　　*　　*

ఉదయం సుమారు ఎనిమిది గంటలవేళ తనను ఎవరో పిలిచినట్టుకాగా, ఇందిర వీధి గుమ్మంలోకివచ్చి చూసింది. నీటుగా డ్రస్సు వేసుకుని, నవ్వుతూ ఓ కుర్రాడు కనిపించాడు. "ఇందిరా" అన్నాడా కుర్రాడు ప్రేమ ఘట్టంలో ప్రియుడు పలికినట్టు.

"ఎవరు?" అన్నది ఇందిర అగమ్యంగా.

అః! నన్ను ఎరగవూ— నేనునీ...సుబ్బారావును" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ అమితానందంగా. ఇందిరకు కొన్ని క్షణాల పాటు ఈ లోకం కనిపించలేదు. నిన్న వచ్చాడు సుబ్బారావా—ఇవాళ ఇతనొక సుబ్బారావు?...ఇదేమిటో ఆమెకు అర్థం కాలేదు. ఇందులో ఏదో వున్నట్టుందని గ్రహించి, అంతలోనే సర్దుకుని ఆప్యాయంగా అతన్ని లోపలకు ఆహ్వానించింది.

"నీ కోసం ఎంత తహతహలాడానో దేవుడుకూడా లెఖ్ఖకట్టలేడు!" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

ఇందిర చిరునవ్వునవ్వి, "ఇప్పుడే వస్తా" నంటూ లోపలకు వెళ్ళింది. సుబ్బారావు ఆ యింటి అల్లుడిగా దర్జాగా కుర్చీలో కూచుని సిగరెట్టు ముట్టించాడు!

కొన్ని నిమిషాల్లో ఎవరో వీధిలోంచి "ఇందిర వున్నదా?" అని అడగటం విని సుబ్బారావు గిరుక్కున వెనక్కు తిరిగి చూడగా—రామ్మూర్తి! రామ్మూర్తి కేవలం రాతిబొమ్మల్లే ఐపోయి—క్షణం పోయాక నెమ్మదిగా "సుబ్బారావు" అన్నాడు పెదవులతో. రామ్మూర్తిని చూడగానే సుబ్బారావూ అగమ్యంలోపడి, 'రామ్మూర్తి' అన్నాడు గొంతులోనే.

"ఎప్పుడొచ్చావ్?" అన్నాడు సుబ్బారావు.

రామ్మూర్తి తడబడుతున్న రెండుకాళ్లూ గట్టిగా నిలదొక్కుకుని—"ఇక్కడ బయలుదేరటమే సరాసరి ఇక్కడకు చేరాను!" అన్నాడు ఏమాత్రం జంకూ గొంకూ లేకుండా—నీట మునిగిపోదామనుకున్న వాడు 'చలి'కి భయపడటం అనవసరం అని గుర్తువచ్చి.

"మీవూరు వెళ్ళాలన్నావుగా" అన్నాడు సుబ్బారావు.

"వూరికే అన్నాను" అన్నాడు రామ్మూర్తి ముక్తసరిగా.

"నాతో ఈమాట చెప్పలేదేం?" అన్నాడు అధికారంగా సుబ్బారావు.

"అనవసరం అని"

ఈసారి రామ్మూర్తి సమాధానం 'పెడ'గా వున్నట్టు సుబ్బారావు గ్రహించి— "ఇక్కడ నీకేం పని?" అని గద్దించాడు.

"నువ్వేం పనిమీద వచ్చావో నేనూ ఆ పనిమీదే వచ్చాను. సుబ్బారావ్—ఇక ముసుగులో గుద్దులాట ఎందుకు? నేను ఇందిరను గాఢంగా ప్రేమించాను. నిన్ననే ఆమెను కలుసుకుని అన్నీ మాట్లాడేశాను. ఇప్పుడు నాపేరు సుబ్బారావు. ఇక్కడ నీకేం హక్కూ, అధికారమూ లేవు. నువ్వు వెళ్ళవచ్చు!" అన్నాడు సీరియస్‌గా రామ్మూర్తి. రామ్మూర్తి ఏం మాట్లాడుతున్నాడో సుబ్బారావుకు అర్థంకాలేదు. ఇది కలా, నాటకమా, ఏదన్నా సినిమా ఘట్టమా అనిపించింది. నిజంగా రామ్మూర్తి ఇట్లా మారిపోయాడా?—

"ఏమిటి...నువ్వేం మాట్లాడుతున్నావ్ రామ్మూర్తి!" అన్నాడు కోపంగా సుబ్బారావు.

"వున్నది వున్నట్టు మాట్లాడుతున్నాను. అవును-ఇది నిజం."

సుబ్బారావు ఆ పాదమస్తకం కంపించిపోతూ లేచినించుని, పళ్లు పటపటలాడిస్తూ— "ద్రోహీ!...స్నేహితుడవనినమ్మి..." అనబోతే.—

"డైలాగులు తప్పజెప్పటం అనవసరం. దయచేసి బయటకు వెళ్లు!" అన్నాడు రామ్మూర్తి.

ఇంతలో ఇందిర అక్కడికి వచ్చింది.

"హలో ఇందిరా" అన్నాడు రామ్మూర్తి.

ఇందిర మాట్లాడలేదు. ఇద్దర్నీ చూస్తూ నించున్నది.

"ఇతను నా పేరు పెట్టుకునివచ్చిన రామ్మూర్తి. దుర్మార్గుడు. నేను - సుబ్బారావును!" అన్నాడు ఉక్రోషంగా అసలు సుబ్బారావు.

"నాన్సెన్స్! ఇందిరా - నేను సుబ్బారావును కానూ - వీడెవడో నాపేరు పెట్టుకొచ్చి మోసం చేదామనుకుంటున్నాడు" అన్నాడు నకిలీ సుబ్బారావు.

"గెటవుట్" అని అరిచాడు సుబ్బారావు కళ్ల నీళ్ల పర్యంతమై.

"నువ్వెవడి వయితే నాకేం? రా ఇందిరా పోదాం" అన్నాడు రామ్మూర్తి ముందుకు పోతూ.

"ఆగండి" అన్నది ఇందిర.

రామ్మూర్తి ఆగాడు. సుబ్బారావులో సంతోషం ఉదయించింది.

"ఇదంతా నాకు అర్థం కాకుండావున్నది. ఎవరు సుబ్బారావో నాకేం తెలియటంలేదు. ఋజువు చెయ్యండి!" అన్నది.

"నేను ఇందిరానీ సుబ్బారావును" అన్నాడు రామ్మూర్తి.

"నేను ఇందిరానీ సుబ్బారావును" అన్నాడు సుబ్బారావు.

"నువు రాసిన ఉత్తరాలన్నీ వీకరువు పెడతాను" అన్నాడు రామ్మూర్తి.

"ఇందిరా-వీడు నాస్నేహితుడు రామ్మూర్తి. నువు రాసిన ప్రతీ వుత్తరం వీడు చదివాడు. నీకు నేను రాసిన ప్రతీ ఉత్తరాన్ని చూపిస్తే ఇట్లా ద్రోహంచేశాడు. నువ్వు రాసిన ఉత్తరాలన్నీ నేను చూపిస్తాను"

"అదంతా అబద్ధం. నువ్వురాసిన వుత్తరాలన్నీ వీడు నాదగ్గర్నుంచీ దొంగిలించాడు."

"అబద్ధం" అని అరిచాడు సుబ్బారావు.

"ఇష్" అన్నది ఇందిర.

"మాడండీ-మీలో ఎవరు సుబ్బారావో ఎవరు కారో తర్వాత తేల్చుకుందాం. ఇంతకూ, నిజం చెబుతున్నాను వినండి. మీకు రాసిన ఉత్తరాలన్నీ-నేను రాసినవి కావు. అందులో ఒక్క అక్షరం నేను రాయలేదు. అసలు నాపేరు ఇందిర కాదు-నిర్మల. అదంతా మాఅన్నయ్య ఆడిన నాటకం. తనే ఇందిరగా రాస్తూ మీరు ఫోటో పంపమని రాయగానే ఏ ఆలోచనా లేకుండా నాఫోటో పంపేశాడు. కలంస్నేహం చేస్తానని ప్రేమలోకి దిగే మీలాంటి ప్రేమ పిచ్చివాళ్ళకు బుద్ధి చెప్పాలని తన సంకల్పం అట. అంచాత, మీలో ఎవరు సుబ్బారావో మా అన్నయ్యే వచ్చి తేల్చుకుని మిగతా వ్యవహారం నెరవేరుస్తాడు. మధ్య నాకెందుకు వాడినే పిలుస్తాను వుండండి!" అని ఇందిర లోపలకు వెళ్ళింది.

సుబ్బారావు మూర్ఛపోయాడు !

రామ్మూర్తి సర్వేంద్రియాలూ స్తంభించిపోయి, రక్త ప్రవాహం ఓక్షణం పాటు ఆగిపోయింది!

కాస్సేపట్లో ఇందిర తన అన్నయ్యను వెంటబెట్టుకుని ముందు గదిలోకి రాగా, రెండు ఖాళీ కుర్చీలు మాత్రం నివ్వెరపోయి నించుని, తర్వాత ఒకదాన్నొకటి చూస్తూ పకపకమని నవ్వుకున్నై ! ★